క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారన్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఎంపీపీ కోరారు.

శ్రీశైల మల్లికార్జున స్వామి తలపాగాకు గ్రామోత్సవం


శ్రీశైల మల్లికార్జున స్వామివారి తలపాగాను ఊరేగిస్తున్న కె.జగన్నాపురం గ్రామస్తులు

అయినవిల్లి: శ్రీశైలంలో కొలువైన మల్లికార్జున స్వామికి శివరాత్రి సందర్భంగా అంబాజీపేట వాస్తవ్యులు సమర్పించే తలపాగాకు ఈసారి అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో గ్రామోత్సవం జరిపారు. గత రెండేళ్లుగా అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామంలో చేనేత కార్మికులు గుమ్మడి అమరేశ్వరరావు పోలమాంబ దంపతులు నియమ నిష్టలతో రోజుకి మూర చొప్పున నూలు మగ్గం నేత నేసి అదే గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి నేరుగా శ్రీశైల క్షేత్రానికి బయలుదేరే సంప్రదాయం ఉంది. ఈసారి తలపాగా స్వామివారి దేవస్థానానికి పంపే ముందు పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో గ్రామోత్సవం జరిపారు. కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన ములికి షణ్ముఖరావు, లీలా నాగమంబ దంపతులు వారి స్వగృహంలో స్వామివారి తలపాగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. స్వామి వారి తలపాగా, అమ్మవారికి చీర, సారె, బసవన్నకు శెనగల మూటను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అశేష భక్తజన సందోహంతో గ్రామోత్సవం జరిపారు. ఈ తలపాగా స్వామివారి సన్నిధి చేరుస్తామని వారు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలి


అంబాజీపేట సెంటర్‌లో ర్యాలీగా వెళుతున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: ఎన్నికల సమయం సమీపిస్తోందని, బూత్ కమిటీ సభ్యులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అన్నారు. చాకలిపాలెంలో ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి నిర్వహించిన పార్టీ సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీగా తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ నిరుపేదలకు నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు అందాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రతి ఓటర్‌ను పలుమార్లు కలిసి వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించి ఆశీర్వదించాలని కోరాలన్నారు. అంతకుముందు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఇంటి వద్ద నుంచి గ్రామాల్లో బైక్ ర్యాలీని నిర్వహించి, నాలుగు రోడ్ల సెంటర్‌లో సీఎం జగన్, వైఎస్సార్ సీపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పేరి శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వాసంశెట్టి పెదబాబు, ఉందుర్తి నాగబాబు, మట్టపర్తి హరి, కొర్లపాటి కోటబాబు, రాయుడు షణ్ముక్, కాంగ్రేగుల దుర్గ, రాయుడు కృష్ణమహేష్ పాల్గొన్నారు.

ఇంటింటికీ పరిశీలన

ఆలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పల్స్‌పోలియోపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకూ ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి సమగ్ర పరిశీలన చేస్తున్నట్లు వైద్యాధికారులు పి.భవానీశంకర్, సువర్చలాదేవి తెలిపారు. మండలంలోని 18 గ్రామాల పరిధిలో నిర్దేశించిన 5891 లక్ష్యాన్ని మూడవ రోజు మంగళవారం అధిగమించారు. తొలి రోజు 5721 రెండో రోజు 189, మూడో రోజు 42 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: ఇంటింటా పల్స్‌పోలియో కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఈనెల 3న పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా మండలంలోని వానపల్లి, అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పోలియో బూత్‌లు వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సోమవారం నుంచి సిబ్బంది మండలంలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టారు. ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేశారు.

జల్‌జీవన్‌తో ఇంటింటికీ తాగునీరు

- శివారు ప్రాంతాలకు పైప్‌లైన్లు ఏర్పాట్లు పూర్తి
- విరివిగా వాటర్ ట్యాంకుల ఏర్పాటు

ఆలమూరు: గోదావరి చెంతన ఉన్నా తాగునీరు సమస్య ఇప్పటి వరకూ అలానే ఉంది.. భూగర్భ జలాల ప్రభావం వల్ల వేసవిలో తాగునీరు కొరత ఏర్పడేది. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్లు లేక సురక్షిత తాగునీరు అందే అవకాశం లేకుండా ఉండేది. గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటి సమస్యలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లతో జల్‌జీవన్ మిషన్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందే ఏర్పాట్లు చేస్తుంది. గతంలో ప్రతి మనిషికి అందిస్తున్న 55 లీటర్ల తాగునీటిను 100 లీటర్లకు పెంచేలా ఈ జల్‌జీవన్ మిషన్ కృషి చేస్తుంది. గత ఏడాది ఢిల్లీ నుంచి జల్‌జీవన్ మిషన్ ప్రత్యేక అధికారుల బృందం ఇంటింటికీ తాగునీరు ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో పర్యటించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన రీతిలో సురక్షిత తాగునీరు అందించేందుకు వీలుగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచనలు, సలహాలను అందించి ప్రజలకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేసింది. అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించి శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి ఇంటికీ తాగునీరు అందించిన గ్రామాలకు స్టార్ రేటింగ్ ఇచ్చి గ్రామ పంచాయతీలను జల్‌జీవన్ మిషన్ ప్రోత్సహిస్తుంది.


చెముడులంక శివారు గాంధీనగరంలో చురుగ్గా సాగుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణం


మోదుకూరులో శరవేగంగా జరుగుతున్న పైప్‌లైన్ పనులు

తుది దశకు చేరుకున్న ఇంటింటికీ తాగునీరు

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజవర్గాల్లోని 184 గ్రామాలు, 237 గ్రామ సచివాలయాలకు సంబంధించి జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీరు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మిగిలిన గ్రామాల్లో ఇప్పటి వరకూ 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఇంటింటికీ తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇప్పటికే సుమారు 80 శాతం గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరికి గూడు కల్పించాలన్న సదుద్దేశంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలతో పాటు వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతుంది.

> **ప్రతి ఇంటికీ తాగునీరే..**
>
> 
>
> ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా జల్‌జీవన్ మిషన్ పనిచేస్తుంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పైప్‌లైన్ల నిర్మాణం పూర్తి చేశాం. అవసరమైన చోట వాటర్‌ట్యాంకులను నిర్మిస్తున్నాం. ఒక్కొక్కరికి ప్రతి రోజు వంద లీటర్ల నీటిని అందించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం.
>
> – పి.పద్మ, ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఆలమూరు

మిథున్‌రెడ్డి పర్యటనతో పార్టీ శ్రేణుల్లో జోష్

- గంటి నుంచి భారీ బైక్ ర్యాలీ
- పి.గన్నవరంలో ఘనంగా స్వాగతం


గజమాలతో మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు


తాటిపాక నుంచి కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరిన మాజీ మంత్రి గొల్లపల్లి

పి.గన్నవరం/మామిడికుదురు: ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పి.గన్నవరం మండలంలో మంగళవారం జరిపిన పర్యటన వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి నుంచి జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావుతో పాటు పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్, కార్ల ర్యాలీతో భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా బయలుదేరి పి.గన్నవరం మూడ రోడ్ల జంక్షన్‌కు చేరున్నారు. అక్కడ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి బయలు దేరి చాకలిపాలెం శ్రీకృష్ణ బాలాజీ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కావడంతో అక్కడ కోలాహలం నెలకొంది. జెడ్పీటీసీలు బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాసరావు, కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీలు కుసుమ వనజకుమారి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల శేఖర్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, వారా జయసావిత్రి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ముత్తాబత్తుల ప్రశాంత్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ జక్కంపూడి తాతాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కార్యకర్తలు సిద్ధం

రాజోలు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం చాకలిపాలెంలో జరిగిన పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమావేశానికి తాటిపాక నుంచి బైక్ ర్యాలీతో గొల్లపల్లి కార్యకర్తలతో కలసి తరలివెళ్లారు. సమావేశానికి హాజరైన రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయపథంలో నిలిపేందుకు సమరోత్సాహంతో ఉన్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా అన్ని వర్గాలు ఆకాంక్షిస్తున్నాయన్నారు. రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, పార్టీ నాయకులు మంగెన సింహాద్రి, బండారు కాశీ, బొమ్మిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మోటార్ సైకిళ్ల ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి


ఆలమూరులో తాగునీటి ఎద్దడిపై సమీక్షిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆలమూరు: వేసవి దృష్ట్యా రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి నివారణకు, సంపూర్ణ పారిశుధ్యానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శుల క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరాపై అధ్యయనం చేయాలన్నారు. చేతి పంపులు కాని, కుళాయిలు గాని మరమ్మతులకు గురైతే సత్వరమే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే మురుగునీరు వీధుల్లో నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ చేపట్టబోయే పనులకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సహకరించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు మండల ప్రజా పరిషత్ సిద్ధంగా ఉందని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఏఓ వి.రామ్‌స్వరూప్, ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాని వారినే తొలగించారు

- తప్పుడు ఆరోపణలను సహించేది లేదు
- కల్యాణ కట్ట నాయీ బ్రాహ్మణ సంఘం

మామిడికుదురు: విధులకు సక్రమంగా హాజరు కాని 13 మంది సభ్యులను దేవదాయ శాఖాధికారులు బాధ్యతల నుంచి తొలగించారని దీన్ని సాకుగా చూపి అసత్య ఆరోపణలు చేస్తున్నారని అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం కల్యాణ కట్ట నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. అప్పనపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగవెంకటసత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీరవెంకటదుర్గారావు, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గూడపల్లి రమేష్ పాల్గొన్నారు. దేవదాయ శాఖాధికారులకు, ధర్మకర్తల మండలి, ప్రజా ప్రతినిధులు ఆలయం ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని సమష్టిగా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కేశఖండన కార్మికులకు నెలకు రూ.20 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వం 2023 మార్చి 13వ తేదీన జీవో 110 విడుదల చేసిందన్నారు. మార్చిలో జీవో విడుదల చేసినా ఆగస్టు వరకు ఆ జీవో అమలు కాలేదన్నారు. దీనిపై ఏడు రోజులు సమ్మె చేశామని గుర్తు చేశారు. కల్యాణ కట్టలో పని చేస్తున్న 46 మందికి జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలని ఆందోళన చేపట్టామన్నారు. దీనిలో 65 ఏళ్లు పైబడిన తొమ్మిది మందిని తొలగించగా మిగిలిన 37 మందికి రూ.20 వేలు వంతున జీతం ఇవ్వాలని పోరాటం చేశామన్నారు. అంత మంది కార్మికులు ఆలయానికి అవసరం లేదని, అంత మందికి జీతం ఇచ్చే పరిస్థితి కూడా లేదని అధికారులు తేల్చి చెప్పారన్నారు. దీనిపై పరిశీలన చేసి విధులకు సక్రమంగా హాజరు కాని 13 మందిని తొలగించారని చెప్పారు. అందరి సమక్షంలో ఈ అంగీకారం కుదిరిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ముడుపులు ఇచ్చామంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సమావేశంలో పాల్గొన్న కల్యాణ కట్ట నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

- సంక్షేమంతో పాటు అభివృద్ధీ చేసి చూపిస్తున్నాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


ముమ్మిడివరప్పాడు వద్ద రోడ్డు పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి


ముమ్మిడివరప్పాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం సుమారు రూ.4 కోట్ల విలువైన రోడ్ల నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో వేయలేక కేవలం శిలాఫలకాలకే పరిమితమైన చాలా వరకు రోడ్లను నిర్మించి చూపించామని, రావులపాలెంలోని పలివెల మీడియం డ్రైన్ పనులు గత ప్రభుత్వంలో కేవలం శిలాఫలకం మాత్రమే వేస్తే సీఎం జగన్ ప్రభుత్వంలో పని పూర్తి చేసి చూపించామన్నారు. అలాగే ముమ్మిడివరప్పాడు రోడ్డు పనులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అమలాపురం–బొబ్బర్లంక రోడ్డు వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకు రిపేర్లకు రూ.40 లక్షలు, రాజవరం పాదలాడ రోడ్డు బొబ్బర్లంక నుంచి అంకంపాలెం శివారు వరకు రోడ్డు రిపేర్‌కు రూ.40 లక్షలు, ఊబలంక నుంచి ర్యాలి వెళ్లే రోడ్డు రిపేర్‌కు రూ.10 లక్షలు, ర్యాలి నుంచి బుల్లియరేవుపాటి చెరువు మీదుగా అంకంపాలెం వెళ్లే రోడ్డు రిపేర్‌కు రూ.37 లక్షలు, గోపాలపురం నుంచి పూరేటి వారి చెరువు లక్ష్మీపోలవరం మీదుగా పొడగట్లపల్లి వెళ్లే రహదారి రిపేర్‌కు రూ.40 లక్షలు, ఉచ్చిలి నుంచి వద్దిపర్రు వెళ్లే రోడ్డు రిపేర్‌కు రూ.10 లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి నమ్మి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. టీడీపీ పాలకుల్లా మేనిఫెస్టో మాయం చేసి ఇప్పుడు అంత కన్నా ఎక్కువ ఇస్తాం అని చెప్పే కల్లబొల్లి కబుర్లు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ఇచ్చిన హామీలు తుంగలో తొక్కే పద్ధతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది కాదని, ఇచ్చిన హామీలు అమలు చేసి మంచి జరిగితేనే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అని అన్నారు. 2024లో ప్రజా ప్రభుత్వం దిశగా అడుగులు వేస్తున్నారని, మరలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సచివాలయ భవనం ప్రారంభం

మండలంలోని ముమ్మిడివరప్పాడులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర భారతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేసిచూపించలేకపోయిన గ్రామ స్వరాజ్య భావనను నిజం చేసి చూపించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి గ్రామంలో 2000 మందికి ఒక గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మించి ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే మండల కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగే పరిస్థితిని సమూలంగా మార్చివేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

శివపూజకు వేళాయెను..


- రేపు రాత్రి ఉమా కొప్పేశ్వరుని కల్యాణం
- 8న మహాశివరాత్రి, రథోత్సవం


కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయం

కొత్తపేట: జిల్లాలో పురాణ ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రం ఒకటి. అగస్త్యేశ్వర మహాముని కోరిన మేరకు శివపార్వతులు ఏకపీఠంపై కొలువు దీరడం ఈ క్షేత్రంలో ఒక విశేషం. పరమశివుని మహా భక్తుడైన పూజారి ప్రాణాలు నిలిపేందుకు శివుడు కొప్పు ధరించిన వైనం మరో విశేషం. అందుకే ఈ క్షేత్రంలో శివలింగానికి ముందు భాగంలో కొప్పు వుంటుంది. ఈ క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ మేరకు ఎంపీపీ మార్గన గంగాధరరావు పర్యవేక్షణలో దేవస్థానం పాలకమండలి చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఈఓ, సిబ్బంది బుధవారం నుంచి ఈ నెల 11 వరకూ శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. 6 రోజులు పాటు పాంచాహ్నిక ధ్వజారోహణ దీక్షతో దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శివలింగం

పూర్వం పల్వలపురం అనే ఈ పలివెలలో శివాలయం పురాణ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శివలింగాన్ని అగస్త్య మహర్షి ప్రతిష్ఠించినట్టు స్థల పురాణంలో పేర్కొన్నారు. అగస్త్య మహర్షి శివపార్వతుల కల్యాణం చూడాలనే కోరికతో కౌశిక నది తీరాన శివలింగ ప్రతిష్ట చేశాడు. దక్షయజ్ఞానికి పూర్వం ఇంద్రాది దేవతలు, హిమవంతుడు అగస్త్య మహర్షి తన దివ్య దృష్టితో శివపార్వతుల కళ్యాణం వీక్షించగా శివపార్వతులు మధుపర్కాలతో కనిపిస్తారు. అగస్త్య మహర్షి శివుని ప్రార్థించగా శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా మీ కల్యాణ దంపతులు ఒకే పీఠంపై అనుగ్రహించమని కోరాడు. ఆ విధంగా ఇక్కడ ఏకపీఠంపై శివలింగం, పార్వతీదేవి అమ్మవారు ఉంటారు. ఈ విధంగా ఎక్కడా శివపార్వతులు కలిసి ఉన్న ఏకపీఠం కనిపించదు.


ఏకపీఠంపై పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి

నేటి నుంచి కల్యాణోత్సవాలు

బుధవారం రాత్రి 4.45 గంటలకు (తెల్లవారితే గురువారం) స్వామి వారి కల్యాణోత్సవానికి, 8న మహాశివరాత్రి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దర్శనానికి, మధ్యాహ్నం 3.29 గంటలకు రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 11 వరకూ ప్రతిరోజూ వివిధ పూజా, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, త్రిశూల స్నానం, పుష్పోత్సవంతో పాటు కోలాటం, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు వైభవంగా నిర్వహిస్తారు.

శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం వృద్ధగౌతమి నదీపాయలో శివరాత్రి మహోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు తొత్తరమూడి సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు వారా జయసావిత్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నదీపాయ ఇరువైపులా గట్టు ఏర్పాటు చేసి ఇంజిన్ల సాయంతో నీటిని తోడుతున్నారు. నదీపాయ వెంబడి ఉన్న పరిసరాలను పంచాయతీ సిబ్బంది పొక్లెయిన్, కూలీలతో శుభ్రం చేయిస్తున్నారు. భక్తులకు స్నానాలు చేసేందుకు జల్లు స్నానాలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా టెంట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిండప్రదానాలు, మూసివాయనాలు వంటివి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పంచాయతీ కార్యదర్శి గరిమెల్ల రవి తదితరులు ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం ఘనంగా జరిగింది. పాంచాహ్నిక తొలి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వేద పండితులు అల్లంరాజు భరణీ, వాడపల్లి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో పురోహితుల బృందం సోమవారం రాత్రి ఈ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. అలాగే మూలస్థాన అగ్రహారంలో వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో దేవదాయశాఖ కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది.

పేదలకు సాయం పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. కాగా దాతలు సాయంతో ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ళ విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు గాను సేవా కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు రూ.20 వేలు విరాళంగా అందజేశారన్నారు. అసోసియేషన్ సభ్యులు ఏ.మధురాజు, బళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


అవిడిలో ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావుకు సాగునీటి సమస్య వివరిస్తున్న రైతులు

కొత్తపేట: ప్రస్తుత రబీలో సాగునీరు సమస్య తలెత్తకుండా తగినంత నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పలివెల లాకుపైన అవిడి–మాచవరం చానల్ ద్వారా సాగునీరు ఇబ్బంది తలెత్తే పరిస్థితిని అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, సొసైటీ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం తదితరులు, రైతులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. జగ్గిరెడ్డి వెంటనే స్పందించి ఇరిగేషన్ శాఖ ఎస్ఈతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈతో పాటు తహసీల్దార్‌ను ఆదేశించారు. వారు సాగునీటి పరిస్థితి, వరి చేలను పరిశీలించారు. సర్పంచ్ చంటి, రాజారత్నం మాట్లాడుతూ ప్రస్తుతం వంతుల వారీ విధానంలో ఇస్తున్న సాగునీరు మరో 24 గంటలు అదనంగా ఇవ్వాలని, డ్రైన్‌పై క్రాస్‌బండ్ ఏర్పాటు చేయాలని ఎస్ఈని కోరారు. ఎస్ఈ మాట్లాడుతూ సాగునీరు విషయంలో రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడా నీటి ఎద్దడి రానివ్వమని, ఆ విధంగా అవసరమైన నీరు ఉందన్నారు.